క్లుప్తంగా

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలి



ప్రభుత్వ విప్ ఆదితో సమావేశమైన సీతారాములు, వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో సంక్షోభాలను నివారించి నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కోరారు. మంగళవారం సిరిసిల్లలోని పీఆర్ అతిథిగృహంలో మంగళవారం వస్త్రోత్పత్తిదారులు, కార్మిక నాయకులతో ఆది శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ, సిరిసిల్లలో కరెంట్ సమస్యతో కార్ఖానాలు బందుపడ్డాయని, రెండు దశాబ్దాలుగా అందించిన 50 శాతం విద్యుత్ సబ్సిడీని 10 హెచ్‌పీలకు పరిమితం చేయడంతో వస్త్రపరిశ్రమ కుదేలైందన్నారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని, నేత కార్మికులకు పని కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆది.. నేతన్నలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇప్పటికే నూలు డిపోను రూ.50కోట్లతో మంజూరు చేసిందన్నారు. విద్యుత్ సబ్సిడీపై ప్రభుత్వం కొత్తగా ఎలాంటి జీవోలు జారీ చేయలేదని, గతంలో ఉన్న విధంగానే పరిశ్రమల యజమానులు బిల్లులు చెల్లించాలని కో రారు. దీనిపై ప్రభుత్వస్థాయిలో శాశ్వత పరి ష్కారం చూపుతామన్నారు. పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, సీఐటీయూ నాయకులు మూషం రమేశ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ మొగిలి

ఇల్లంతకుంట : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. మంగళవారం మండలంలోని జంగారెడ్డిపల్లిలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ గౌడ్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనిల్‌నాయక్‌కు అభినందన



గోల్డ్ మెడల్‌తో అనిల్ నాయక్

రుద్రంగి: గోవాలో ఈనె ల 6నుంచి 8 వరకు జరి గిన ఆలిండియా యూత్ గేమ్స్‌లో మండలంలోని గిరిజన బడితండాకు చెందిన అనిల్‌నాయక్ గోల్డ్ మెడల్ సాధించాడు. 800 మీటర్ల రన్నింగ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. అనిల్ నాయక్ గోల్డ్ మెడల్ సాధించడంపై ప్రజాప్రతినిధులు అభినందించారు.

రహదారికి మరమ్మతులు



కోనరావుపేట: మామిడిపల్లి–నిజామాబాద్ గ్రామా ల మధ్య రహదారికి మరమ్మతులు చేపట్టారు. రెండు గ్రామాల మధ్య మూలవాగుపై వంతెన కొట్టుకుపోయి రవాణాకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాజీ ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి ఆధ్వర్యంలో వంతెనపై మొరం పోయించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర సన్నిధిలో మంగళవారం భక్తులసందడి నెలకొంది. సాయంత్రం 4 గంటలవరకు వసతిగదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	04	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	21	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	03	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	01	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	19	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	18	448
పార్వతీపురం స్పెషల్	17	672
పార్వతీపురం సాధారణ	20	336

– వేములవాడ



ఒక్కచోట చేరి ఆడతాం



బోయినపల్లి: బతుకమ్మ పండుగ వచ్చిందంటే మహిళలు ఒకచోట కలుస్తాం. అందరం కలిసి బతుకమ్మ ఆడడం ఎంతో ఆనందంగా ఉంటుంది. ఒకరికొకరు బతుకమ్మ వాయినం ఇచ్చి పుచ్చుకుంటాం. మహిళలు చిన్న పెద్ద తేడా లేకుండా ఆడుకునే బతుకమ్మ పండుగ అంటే ఎంతో ఇష్టం.ఏడాదికోసారి వచ్చే బతుకమ్మను ఘనంగా నిర్వహించుకుంటేనే ఆనందంగా ఉంటుంది.

– గుంటి లతశ్రీ, బోయినపల్లి

తెలంగాణలో పెద్ద పండుగ



బోయినపల్లి: తెలంగాణలో పెద్ద పండుగ బతుకమ్మ.. ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటు తర్వాత పండుగకు గుర్తింపు వచ్చింది. తీరొక్కపూలతో అందంగా బతుకమ్మలు పేర్చి ఒక్కచోట చేరి ఆడడం మహిళలకు ఎంతో ఇష్టం. బతుకమ్మ అంటే పూల పండుగ. రాత్రివరకు ఆడి చెరువుల్లో నిమజ్జనం చేస్తాం.

–కొప్పుల లక్ష్మి, గుండన్నపల్లి, బోయినపల్లి

తీరొక్క పూలతో పేరుస్తాం



ముస్తాబాద్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. తొమ్మిది రోజులు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలు పేర్చి ఆడతాం. గునుగు, తంగేడు, చామంతి పూలు తీసుకొచ్చి పేర్చుతాం. సాయంత్రం గ్రామ కూడళ్ల వద్ద ఉంచి ఆడిపాడతాం. వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వస్తారు.

– రాసమడుగు స్వాతి, ముస్తాబాద్



వేములవాడ అర్బన్ : తిప్పాపూర్ లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఇల్లంతకుంట: వెంకట్రావుపల్లెలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిరిసిల్ల టౌన్ : బతుకమ్మ వేడుకల్లో చైర్‌పర్సన్ కళ, కౌన్సిలర్లు

సద్దుల సంబురం

వేములవాడ:/వేములవాడఅర్బన్: రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయె చందమామ, చిత్తూ.. చిత్తూల బొమ్మ.. అంటూ మహిళలు, యువతులు బతుకమ్మ పాటలతో సందడి చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్, మండలంలోని అనుపురం, కొడుముంజలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మహిళలు తీరొక్కపూలతో అందంగా బతుకమ్మలు పేర్చి గ్రామకూడళ్ల వద్ద ఉంచి ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం బతుకమ్మ తెప్పలవద్ద నిమజ్జనం చేశారు. వేములవాడలో జరిగిన సద్దుల బతుక మ్మ వేడుకల సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను సుందరంగా పేర్చారు.

సిరిసిల్లటౌన్: మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సిరిసిల్ల బతుకమ్మ ఘాట్‌లో సంబరాలు నిర్వహించారు. వందలాది సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు పాల్గొని బతుకమ్మ ఆటలతో అలరించారు. పట్టణంలోని అన్ని వాడల్లో మహిళలు బతుకమ్మ ఆడారు. మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయగా రాత్రి పూట మానేరు నదిలో నిమజ్జనం చేశారు.

మాన్వాడ, వరదవెల్లిలో..

బోయినపల్లి: మాన్వాడ, వరదవెల్లి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్కపూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో ఉంచి ఆడిపాడారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

వెంకట్రావుపల్లెలో..

ఇల్లంతకుంట : వెంకట్రావుపల్లెలో సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు గ్రామ కూడళ్లు, దుర్గాదేవి మండపం వద్ద బతుకమ్మలు ఉంచి ఆడిపాడారు.



వేములవాడ అర్బన్ : బతుకమ్మతో యువతి



వేములవాడ : తల్లితో కలిసి బతుకమ్మను పేర్చుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి





వేములవాడ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వేములవాడ: బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు



వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బోయినపల్లి: వరదవెల్లిలో బతుకమ్మలతో మహిళలు



బోయినపల్లి: మాన్వాడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నిరుద్యోగుల పక్షాన పోరాడుతా



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: నిరుద్యోగుల పక్షాన పోరాడి వారి హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తానని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్లలో విస్తృత ప్రచారం చేపట్టి మాట్లాడారు. పట్టభద్రులు నూరుశాతం ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలని, న్యాయవాదుకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. పట్టభద్రులు, న్యాయవాదులు అందరూ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి అవకాశమివ్వండి

వేములవాడ: రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వేములవాడ బార్ అసోసియేషన్‌లో మంగళవారం న్యాయవాదులతో మాట్లాడారు. అంతకు ముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి రాజన్నను దర్శించుకున్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టు తీసుకువచ్చేందుకు, జూనియర్ అడ్వకేట్లకు స్టైఫండ్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కులు అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన చందుపట్ల లక్ష్మారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మిర్యాల్‌కర్ సాయి గిద్ద చెరువులో, హరి దాస్‌నగర్‌కు చెందిన ఎక్కల్‌దేవి మల్లేశం ప్రమాదవశాత్తు మృతిచెందగా ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.6లక్షల విలువైన బీమా చెక్కులను మంగళవారం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, అనసూయ, మహిళా మండల అధ్యక్షురాలు అప్సరా ఉన్నీసా, పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్, నాయకులు అందె సుభాష్, పిల్లికిషన్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు కుంకుమపూజలు

సిరిసిల్ల టౌన్ : వేములవాడ/ముస్తాబాద్/ కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/ బోయినపల్లి: జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం దుర్గామాత మండపాల్లో కుంకుమపూజలు నిర్వహించారు. సిరిసిల్ల సుభాష్‌నగర్‌లోని దుర్గామాత మంటపంలో అధ్యక్షుడు యెల్లె లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రూ.6.50లక్షల విలువైన కరెన్సీ తోరణాలతో అమ్మవారిని అలంకరించారు. మార్కండేయ భవాని యూత్ అసోసియేషన్ దుర్గామాత మంటపంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అసోసియేషన్ అధ్యక్షుడు నీలి రవీందర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు శ్రీలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు కాత్యాయిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు నాయకులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. పలు మండపాలవద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



ఇల్లంతకుంట: వంతడుపులలో ..



సిరిసిల్లల టౌన్ : కరెన్సీ తోరణాలతో దుర్గామాతకు అలంకారం



బోయినపల్లి: విలాసాగర్‌లో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ముస్తాబాద్: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

రాజన్న సేవలో బండి



వేములవాడ: వేములవాడ రాజన్నను కేంద్ర మంత్రి బండి సంజయ్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

సినీనటుడు శ్రావణ్ రాఘవేంద్ర

సినీనటుడు శ్రావణ్ రాఘవేంద్ర వే ములవాడ రాజన్నను కుటుంబ సభ్యులతో దర్శించుకొని కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేకదర్శన అవకాశం కల్పించారు.

విరాళం అందజేత

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల దుర్గాదేవి మండపాల వద్ద పూజాసామగ్రి కోసం రూ.20వేలు బెంద్రం తిరుపతిరెడ్డి విరాళంగా అందజేశారు. ప్రసన్న, నవీన్, తదితరులున్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు

కోనరావుపేట: మండలానికి చెందిన గిరిజన విద్యార్థిని ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ప్రకటించిన ఎంబీబీఎస్ ఫలితాల్లో మండలంలోని లచ్చపేట తండాకు చెందిన లావుడియా కలబాయి- బాలు నాయక్ (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్)కూతురు శ్రీ వైష్ణవి ఎంబీబీఎస్ సీటు సాధించింది.

రవీందర్‌నాయక్‌కు అభినందనలు

ఎల్లారెడ్డిపేట: రాచర్ల గుండారంకు చెందిన బొడావత్ రవీందర్‌నాయక్ ఇటీవల బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకం కాగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మంగళవారం అభినందించారు. కరీంనగర్‌లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో పూజలు చేసిన సందర్భంగా రవీందర్ నాయక్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రాచర్లగొల్లపల్లి శివారులోని సత్తె పీరీల దర్గా, రాగట్లపల్లి, హరిదాస్‌నగర్, వెంకటాపూర్ గ్రామాల శివారులో మూలమలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు లేవు. కొత్తవారు వస్తే అయోమయానికి గురవుతున్నారు. ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్‌నంబర్ : 9440818864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

సంక్షిప్త వార్తలు

● **మంత్రి పొన్నంను కలిసిన విజయ్‌రెడ్డి**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేట గ్రామానికి చెందిన రేవంత్‌మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిశారు. జిల్లాలో పలు సమస్యలు పరిష్కరించాలని మంత్రికి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని విజయ్‌రెడ్డి తెలిపారు.

● **రుణం చెల్లించాలంటూ మైక్రో సిబ్బంది తిష్ట**

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి డబుల్ బెడ్ రూం సముదాయం (కేసీఆర్ నగర్)లో మంగళవారం మైక్రోఫైనాన్స్ సిబ్బంది తిష్టవేశారు. కొంత కాలంగా కేసీఆర్‌నగర్ కాలనీ మహిళలు మైక్రోఫైనాన్స్‌ల నుంచి రుణం తీసుకొని వారం, పదిహేను రోజులు, నెలవారీ కిస్తీలు చెల్లిస్తున్నారు. మంగళవారం ఫైనాన్స్ సిబ్బంది వసూళ్లకు రాగా పండగపూట డబ్బులు లేవని, గడువు కావాలని తెలిపినా సాయంత్రం వరకు అక్కడే ఉండి ఇబ్బందులకు గురిచేశారు. దీంతో వారు అధికారులకు ఫిర్యాదు చేయగా జిల్లా బ్యాంకుల లీడ్ మేనేజర్ మల్లికార్జున్ ఫైనాన్స్ సిబ్బందితో మాట్లాడటంతో అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా మైక్రోఫైనాన్స్ అప్పుల విషయం ఎస్పీ అఖిల్ మహాజన్ దృష్టికి వెళ్లగా పూర్తి సమాచారం సేకరించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది.

● **ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు**

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో ఈనెల 15న కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని, రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. ఎల్లారెడ్డిపేటలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

● **అంబులెన్స్ బోల్తా**

ఇల్లంతకుంట : మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం అంబులెన్స్ బోల్తా పడింది. ఇల్లంతకుంటకు వచ్చి తిరిగి బాలమాలుపల్లెకు వెళ్తున్న క్రమంలో పెద్దలింగాపూర్ సమీపంలో బోల్తాపడింది. ఈఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

● **గుండెపోటుతో వ్యక్తి మృతి**

వీర్నపల్లి: మండలంలోని సీతారాం నాయక్ తండాలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. బానోతు మోహన్ (52) సిరిసిల్ల గాంధీ ఏరియాలోని ఫొటోషాప్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా గాంధీ విగ్రహం వద్ద ఒకసారిగా కుప్పకూలాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

● **బతుకమ్మ ఏర్పాట్లు పరిశీలన**

బోయినపల్లి: మండలకేంద్రంతో పాటు, తడగొండలో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను ఎంపీడీవో భీమ జయశీల మంగళవారం పరిశీలించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో శ్రీధర్, కార్యదర్శులు ఉన్నారు.

● **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

సిరిసిల్లటౌన్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పలువురికి 25వ వార్డు కౌన్సిలర్ మంగళవారం అందజేశారు. వార్డులోని భారత్ శివసాయి(రూ. 12వేలు), మ్యాన వెంకటేశం(రూ. 46,500), మారుపాక బాలవ్వ(రూ.13,500) చొప్పున చెక్కులను అందజేశారు. ఇక్కడ వార్డు పెద్దలు వంగర దత్తు, బైరి గోదావరి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోతుగల్, గూడెం గ్రామాల్లో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడు తోట ధర్మేందర్, చిట్నేని అంజన్‌రావు, ఎల్లాగౌడ్, గిరి, అనమేని రాజు, తలారి నర్సింలు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

● **కార్యవర్గం ఎన్నిక**

రుద్రంగి: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర యూత్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండి నవీన్, ఉపాధ్యక్షుడిగా గండి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పోగుల మోహన్ ఎన్నికయ్యారు. ఎన్నికై న సభ్యులకు యూత్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● **ఆర్థికసాయం**

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి బీసీ హాస్టల్‌లో ఉంటూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న రమావత్ రోహిత్‌కు పూర్వ హాస్టల్ విద్యార్థులు రూ.6,700 ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ ఉపాధ్యాయుడు హరికృష్ణ రెడ్డి, పూర్వ విద్యార్థులు అజయ్ రెడ్డి, పవన్, ప్రశాంత్, తదితరులున్నారు.